క్లుప్తంగా

మంత్రిని కలిసిన సీఈఓ


మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో సీఈఓ గ్లోరియా

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డిని ఆయన కార్యాలయంలో నూతన జెడ్పీ సీఈఓ గ్లోరియా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వి.కోటలోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు రూరల్: తమ అనుభవంలోని భూమిని ఓ ఉద్యోగికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలని వావిల్‌తోట పంచాయతీ పెరుమాళ్లపల్లెకు చెందిన రఘు, శేఖర్ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు గతంలో 5 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చారని, అయితే క్షేత్ర స్థాయిలో 3 సెంట్ల భూమి మాత్రమే ఉందన్నారు. ఈ భూమికి ఓ ఉద్యోగికి పట్టా ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.50 వేల విరాళం


నగదు విరాళం అందజేస్తున్న జగదీష్‌రెడ్డి

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం దాత రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు బాబు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కమిటీ సభ్యులు గ్రామానికి చెందిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, ప్రకృతి రైతు జగదీష్‌రెడ్డిని కోరామన్నారు. దాంతో రూ.50 వేలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. జగదీష్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం


చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడి వీధిలోని జైన్‌సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిబిరం ఉంటుందని, ఆపరేషన్‌కు ఎంపికైన వారికి అన్ని సేవలు ఉచితంగా కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


సురక్ష శిబిరానికి హాజరైన జనం

గుడిపాల: జనం వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, మెరుగైన వైద్యం ప్రభుత్వం అందిస్తుందని వైద్యులు రమేష్‌బాబు, సునీల్, అనూష అన్నారు. చీలాపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల నుంచి ప్రభుత్వం రూ.25 లక్షల వరకు కార్పొరేట్, జిల్లా ఆస్పత్రుల్లో అందే సేవలపై తెలియజేశారు. అనంతరం 271 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వచ్చిన వారందరికీ మందులు, మాత్రలను ఉచితంగా అందజేశారు. ఇందులో అత్యధికంగా చక్కెరవ్యాధి గ్రస్తులు రావడం జరిగింది.

ఇంటి వద్దనే వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికీ ప్రభుత్వం ఉచిత వైద్య సేవలందిస్తోందని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహన్‌వేలు 42 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

మార్చి నెల 3వ తేదీన నిర్వహించే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. తవణంపల్లె పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మండలంలో 0–5 ఏళ్లలోపు 5642 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్ను దన్నుగా..

- రైతులకు అందుబాటులో కియోస్క్‌లు
- తొమ్మిది రకాల సమాచారం ఒకేచోట
- గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు


యాప్ వినియోగాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది


కియోస్క్‌లో పొందుపర్చిన మల్టీఫంక్షనల్ యాప్‌లు

ఐరాల: అన్నదాత సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మల్టీ ఫంక్షనల్ కియోస్క్ ద్వారా రైతులు తొమ్మిది రకాలైన సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి అంశాన్ని ఎక్కడో తెలుసుకునే కంటే గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఆర్బీకేల్లో పొందుపర్చిన కియోస్క్ ద్వారా సులభంగా తెలుసుకునే వీలు కల్పించారు. దీని ద్వారా ఏ కాలంలో ఏ పంటలు వేయాలి, కొనుగోలు కేంద్రాలు, పంట నాణ్యతా ప్రమాణాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, మార్కెట్‌లో కనీస మద్దతు ధరలు తదితర అంశాలను రైతులు తెలుసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు

గతంలో రైతులు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడో తెలియక దళారులను ఆశ్రయించే వారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా ఆర్బీకేలో ఏర్పాటుచేసిన కియోస్క్ దగ్గరలోని కొనుగోలు కేంద్రాల్లోనే విలువైన సమాచారం అందుతోంది. దీంతో రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

నాణ్యతా ప్రమాణాలు

సీజనల్‌గా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, టమాటా, వేరుశనగ, మిరప, కందులు తదితర పంటలకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలను తెలియజేస్తుంది. ఏ పంట మేర నాణ్యత ఉంటే గిట్టుబాటు ధర లభిస్తుందనేది ఈ యాప్‌లో పొందుపర్చారు.

వాతావరణం

వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఆర్బీకే పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దీనికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చని సులభంగా తెలుసుకోవచ్చు.

మార్కెట్ ధరలు

మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలను తెలుసుకోలేక ఒక్కొక్కరు ఒక్కోలా చెప్పడంతో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేంది. అయితే ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి ఆర్బీకేకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పంటల తేమశాతం ఆధారంగా రైతు విక్రయించుకునే సమయానికి కనిష్ట, గరిష్ట మార్కెట్ ధరలను తెలుసుకోవచ్చు.

రైతు సమాచారం

రైతులకు సంబంధించి వ్యవసాయ వార్తలను కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చు. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం సాగుచేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, ఆర్బీకేల ద్వారా పంటలు కొనుగోలు వంటి వార్తా సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

కనీస మద్దతు ధరలు

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేదిశగా ఆర్బీకే పరిధిలో ముఖ్య పంటలకు కనీస మద్దతు ధరలు తెలుసుకునే వీలుంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు తదితరాల అంశాల్లో రైతు నష్టపోకుండా అనుకూలమైన ధరలకు అమ్ముకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు.

ప్రయోగశాలల సమాచారం

ఆర్బీకే పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ఏ భూమిలో ఏ పంట వేయాలి, దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు వచ్చిన రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు చేసుకునేందుకు వీలుంది.

ట్యుటోరియల్

కియోస్క్‌లో పొందుపర్చిన ఆఖరి యాప్లో అన్ని రకాల పంటలకు సాగుచేసే విధానానికి సంబంధించిన వీడియోలు ప్రదర్శించడం, ఆర్బీకే చానల్ ప్రోగ్రామ్స్ చూపించడం, సమగ్ర సస్యరక్షణ, పంట యాజమాన్యం తదితరాలను వీడియో రూపంలో చూపించి రైతులకు అవగాహన కల్పించనున్నారు.

అనుబంధిత యాప్

కియోస్క్‌లో పొందుపర్చిన అనుబంధిత యాప్‌లో మరో ఐదు అంశాలను చేర్చారు. ఆర్బీకే అమ్మకాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న పనిముట్లు, పశుసంవర్ధక, మత్స్య సంపద ఉత్పత్తులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, ఇతర ప్రయోజన సౌకర్యాలు తెలుసుకునే వీలుంది.

రైతులకు ప్రయోజనం



ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చే యాప్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరనున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చు.

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రాకారోత్సవం ఉంటుందని వివరించారు.

పంచాయతీ బకాయిలు చెల్లించండి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీలో పేరుకుపోయిన మొండిబకాయిలు చెల్లించాలని ట్రాన్స్‌కో ఎస్ఈఓ శ్రీనివాసులు, రూరల్ ఈఈ హరి కోరారు. డీపీఓ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు జిల్లాలో వీధిదీపాలు, వాటర్ వర్క్స్ సంబంధించి రూ.69 కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. వీటిని ఇటీవల వచ్చిన ఆర్థిక సంఘం నిధుల నుంచి కొంతమేరకు చెల్లింపులు చేయాలని తెలియజేశారు. ఆర్థికసంఘం నిధుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. అందువల్ల చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు.

కేంద్రం తీరు దారుణం

చిత్తూరు కార్పొరేషన్: రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఢిల్లీలో రైతుల ఉద్యమాన్ని అణచివేయడం సరికాదన్నారు. అందుకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా బ్లాక్ డే ను నిర్వహించాలని పిలుపులో భాగంగా నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, మణి, గోపినాథ్, చంద్రయ్య, రఘు, గజేంద్రబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



చిత్తూరు: డ్రైనేజీ సమస్యపై స్థానికులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, గుడిపాల: చిత్తపార చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విజయానందరెడ్డి, నాయకులు

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం–అభివృద్ధి సాగుతోందని ఇలానే రాష్ట్రం మరోసారి అభివృద్ధి చెందాలంటే జగనన్నకు మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. చిత్తపార పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలందరూ మరోసారి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు మరో 50 రోజులు గడువున్న ప్రస్తుత తరుణంలో సమష్టి కృషితో మరోసారి గెలుపునకు కృషి చేయాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ ఇవ్వని సంక్షేమం అభివృద్ధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలుచేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్ని జెండాలు జతకట్టినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. గ్రామాల్లో తిరుగుతుంటే ఆడపడచులు అందరూ జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవియాదవ్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, గోళ్ల హరిప్రసాద్, మొగిలిరెడ్డి, యోవాన్, రవి, గోపి, రమేష్, క్రిష్ణమూర్తి, వెంకటేశులు, నవీన్, కారిమేఘన్, ప్రకాష్, కమల్, రాజా, డానియల్, చిట్టిబాబు, కల్లై అరసిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక రంగాచ్చారివీధి సచివాలయ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో విజయానందరెడ్డి పాల్గొన్నారు. తొలుత డివిజన్ పరిధిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గడపగడపకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఏటీవార ప్రాంతంలో తమ నివాసాలకు వెళ్లేందుకు కాలువగట్టు సరిలేదని స్థానికులు విన్నవించారు. వాటిని బాగుచేసి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. గట్టుపై కరెంటు స్తంభాలు వేసి మార్గం ఏర్పాటు చేస్తామని విజయానందరెడ్డి చెప్పారు. అనంతరం కాంట్రాక్టర్‌కు సమస్యను తెలియజేసి పరిష్కారించాలని ఆదేశించారు. వీరభద్రకాలనీలో పలు సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ లేదని స్థానికులు మొరపెట్టుకున్నారు. సమస్యను పరిష్కారిస్తానని ఆయన స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నజీరా, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఆను, నాయకులు వెంకటేష్, సైఫ్, నవాజ్, గౌస్‌ఖాన్, గఫార్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలి


పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ దేవరాజులు

ఐరాల: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి అందరూ ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు డీఈఓ దేవరాజులు సూచించారు. కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలో గత సంవత్సరం ఉత్తీర్ణతా శాతానికి మించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అన్ని విషయాలు అర్థమయ్యేలా ఓర్పుతో వివరించాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి జగనన్న గోరు ముద్ద పథకం కింద పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రుషేంద్రబాబు, హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, సురేంద్రబాబు, నరేష్‌బాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో ఇంటింటికీ కొళాయి


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బంగారుపాళెం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా కాలనీల్లో ఇంటింటికీ కొళాయిలు అందిస్తున్నట్లు ఎంపీపీ అమరావతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం మండల సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించారు. సభ్యులు జగనన్న కాలనీల్లో వసతులు, తాగునీటి పైప్‌లైన్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రస్తావించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్, కొళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు ప్రతి మూడు మాసాలకోసారి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో చైర్మన్లు నారే సోమశేఖర్, దత్తాత్రేయరెడ్డి, కురబ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లతోపాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇప్పుడే గుర్తొచ్చామా.. ఇన్నాళ్లు ఏమైపోయారు?

చిత్తూరు రూరల్: ''ఇప్పుడే గుర్తుకొచ్చామా.. ఇన్నాళ్లు ఏమైపోయారు. అధికారం ఉంటే ఊళ్లో ఉంటారా..లేకుంటే పట్టించుకోరా. మిమ్మల్ని చూసి ఓట్లు వేయం. పార్టీని చూసి వేస్తున్నాం..మేము మా సొంత డబ్బులతో బ్యానర్ వేసుకుంటే మీకేంటి.'' అంటూ టీడీపీ కార్యకర్తలు నాయకులను నిలదీశారు. చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామానికి మోహన్‌నాయుడి కుంటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి విచ్చేశారు. మోహన్ నాయుడి భార్యకు శుక్రవారం చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం కొంతమంది తమ్ముళ్లు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణీ భర్త చంద్రప్రకాష్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు ఏమైపోయారని, ఎన్నికల సమయంలో మాత్రం గుర్తుకొచ్చామని ప్రశ్నించారు. ఇదే దారిలో పదిసార్లు తిరుగుతారు.. అప్పుడంతా గుర్తుకు రాలేదా అంటూ నిలదీశారు. పార్టీ కార్యకర్త మోహన్‌నాయుడు చనిపోయాడని తెలిసినా కూడా ఏ రోజైనా ఆ కుటుంబాన్ని పరామర్శించారా అంటూ మండిపడ్డారు. తాము సొంత డబ్బుతో ఫ్లెక్సీలు వేసుకుంటే తప్పేమేమిటని మరో నాయకుడి ఎదుట చెప్పుకొచ్చారు. అయితే మీ ముఖాలు చూసి ఓట్లు వేయడం లేదు..పార్టీని చూసి ఓట్లు వేస్తామంటూ సూటిగా చెప్పేశారు. దీంతో బడా నాయకులు బిక్కమొహం పెట్టారు.

భువనేశ్వరి రాక నేపథ్యంలో ముత్తుకూరులో రెండు వర్గాలు పోటాపోటీగా ఫ్లెక్సీలు కట్టారు. అయితే జీజేఎం వర్గానికి చెందిన ఫ్లెక్సీని మరో వర్గం చింపేసింది. దీంతో తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఇదంతా చంద్రప్రకాష్ వర్గీయులే చేశారని జీజేఎం వర్గీయులు కోడైకూస్తున్నారు.

కేపీ శ్రీధర్ జన్మదిన వేడుకలు


కేపీ శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ నాయకులు కేపీ శ్రీధర్ జన్మదిన వేడుకలను నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. న్యూ బాలాజీ కాలనీలోని ఆయన కార్యాలయంలో పలువురు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాశ్రమంలో అన్నదానం, గంగిరెడ్డి స్కూల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్రేన్ సాయంతో కేపీ శ్రీధర్‌ని గజమాలతో సత్కరించారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి దర్శనానికి విచ్చేయగా, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుపై ఓటు.. సంక్షేమానికి బాట


కొనాపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేస్తే సంక్షేమానికి బాట వేసుకున్నట్లేనని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొనాపల్లె, పెరియంబాడి పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం ఉదయం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కమ్మరాయని మిట్ట, కొనాపల్లె, నర్రావూరు ఆదిఆంధ్రవాడ, పెరియంబాడి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ రెండు నెలల్లో రానున్న ఎన్నికలలో అందరు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. జగనన్న ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారన్నారు. జగనన్న సీఎం అయితేనే మరోసారి మనకు ఇప్పుడు వస్తున్న పథకాలన్నీ వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహర్, వైస్ ఎంపీపీ రవీంద్ర బాబు, ముస్లిం మైనారిటీ డైరెక్టర్ కబీర్‌బాషా, మాజీ ఎంపీపీ రాధా సుబ్రమణ్యం, సర్పంచ్‌లు కృష్ణవేణి, జెకే రవి, నాయకులు పయణి, గజేంద్ర, సురేష్‌బాబు, గజేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో టీడీపీ

టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రజలకు ఏం చెప్పాలో అర్థంగాక ఇబ్బందులు పడుతున్నారని డాక్టర్ సునీల్ కుమార్ విమర్శించారు. ఆయన ప్రచారం అనంత రం మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లుగా జగనన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా అందించారని చెప్పారు. అందుకే తాము ధైర్యంగా ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నట్లు తెలిపారు. కానీ టీడీపీ నాయకులు ధైర్యంగా ఈ పథకాలు అమలు చేశాం అని చెప్పలేక అవస్థలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హామీలు నెరవేర్చకపోవడంతో జనం నమ్మడం లేదని స్పష్టం చేశారు.